teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 180 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 28 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5


Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## టీజీ టెట్ హాల్ టికెట్లు విడుదల

### జనవరి 3 నుంచి పరీక్షలు ప్రారంభం

రోజుకు రెండు షిఫ్టుల చొప్పున పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



07



## ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టుల అరెస్టులా..?

జర్నలిస్టుల గొంతు నొక్కడం నిరంకుశత్వమే

టీయూడబ్ల్యూజే నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం

కొత్త జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్

.. వివరాలు 2లో






# భగ్గుమన్న జర్నలిస్టు లోకం

4 కోట్ల జనాభాలో "వేల మందికి కార్డులిస్తే నష్టమేంటి.. ?"

అక్రిడిటేషన్ కార్డులు అనేవి జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హక్కు అని, వాటిని కాలరాసేలా ప్రభుత్వం తెచ్చిన జీవో 252ను వెంటనే ఉపసంహరించుకోవాలని, గతంలో ఉన్న 23,000 కార్డులను 10,000కు కుదించడం అన్యాయమని మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్టులను విభజిస్తూ వారికి కేవలం మీడియా కార్డులు ఇస్తామనడం చెల్లదని, నియోజకవర్గ స్థాయి విలేకరులకు కూడా కార్డులు జారీ చేయాలని స్పష్టం చేస్తూ, శాంతియుతంగా వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన జర్నలిస్టులను అరెస్ట్ చేసి ముషీరాబాద్ జైలుకు తరలించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాజకీయం కాదని, జర్నలిస్టుల మనోభావాలకు సంబంధించిన విషయమని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు వెంటనే జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

కలెక్టరేట్ల ముట్టడితో దద్దరిల్లిన జిల్లాలు

హక్కుల అణిచివేతపై అల్లం నారాయణ ఫైర్

జీవో 252 సవరణ కోరుతూ జర్నలిస్టుల భారీ ఆందోళన

అక్రిడిటేషన్ల కుదింపుపై గళమెత్తిన మీడియా సంఘాలు

ప్రభుత్వం దిగిరాకపోతే ఉమ్మడి పోరాటం

హెచ్చరించిన జర్నలిస్టు నేతలు



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ నిబంధనల జీవో 252ను సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు లోకం సమరభేరి మోగించింది. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు ఉద్రిక్తంగా మారాయి. పలుచోట్ల జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.




## వందేమాతరం కేవలం నినాదం కాదు

భారతజాతి ఆత్మగౌరవ ప్రతీక

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 2లో



## నాపై కుట్ర జరుగుతోంది


- బిడ్డలకు చెప్పినట్లే చెప్పాను
- సినీనటుడు శివాజీ ఆవేదన
- మహిళా కమిషన్ విచారణకు హాజరైన శివాజీ
- దండోరా ఈవెంట్ వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు క్లారిటీ
- వివాదాన్ని ఇంతటితో ఆపేయాలని శివాజీ విజ్ఞప్తి

2



## చలి తీవ్రతకు పడిపోతున్న గాలి నాణ్యత

- హైదరాబాద్‌లో 230 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- 4 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- డిసెంబర్ 31 వరకు కొనసాగనున్న చలి తీవ్రత



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ప్రస్తుతం చలి తీవ్రంగా వణికిస్తోంది. అనేక జిల్లాల్లో సింగిల్ డిజిట్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఈ పరిస్థితి

మిగతా 2 లో



## ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

- సొంతింటి కల నెరవేర్చడమే మా లక్ష్యం :మంత్రి పొంగులేటి
- సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా
- పేద కుటుంబాల్లో సంతోషం నింపిన సన్నబియ్యం పంపిణీ

02






## దేశంలోనే పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ

- 650 నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు విస్తరించిన పరిధి
- 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరణ
- 60 సర్కిళ్లకు డిప్యూటీ కమిషనర్ల నియామకం
- నగర జనాభాకు అనుగుణంగా మెరుగైన పౌర సేవలు

07

తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి, దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

# భగ్గుమన్న జర్నలిస్టు లోకం



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ నిబంధనల జీవో 252ను సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు లోకం సమరభేరి మోగించింది. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు ఉద్రిక్తంగా మారాయి. పలుచోట్ల జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

**నిరసనకు ప్రధాన కారణాలు**

**జీవో 252లోని వివాదాస్పద అంశాలు**

- ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు జర్నలిస్టుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. ప్రధానంగా ఈ క్రింది అంశాలపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- అక్రిడిటేషన్ కార్డుల విభజన: ఫీల్డ్ రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డు, డెస్క్ జర్నలిస్టులకు కేవలం మీడియా కార్డు ఇస్తూ జర్నలిస్టుల మధ్య వ్యత్యాసం చూపడం.
- కార్డుల కోత: గతంలో ఉన్న 26,000 అక్రిడిటేషన్ కార్డులను ఎక్కువ మొత్తంలో తగ్గించేలా నిబంధనలు రూపొందించడం.
- నియోజకవర్గ స్థాయి రద్దు: గతంలో ఉన్న నియోజకవర్గ స్థాయి అక్రిడిటేషన్లను రద్దు చేయడం.
- కఠిన నిబంధనలు: చిన్న పత్రికలకు, వెబ్‌సైట్లకు, ఇండిపెండెంట్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ దక్కకుండా విద్యా అర్హతలు, సర్క్యులేషన్ పేరిట ఆంక్షలు విధించడం.

**రాష్ట్రవ్యాప్త ఆందోళనలు - అరెస్టులు**

నల్లగొండ, సూర్యాపేట, పెద్దపల్లి, రంగారెడ్డి సహా అన్ని జిల్లాల్లో టీయూడబ్ల్యూజే (హెచ్-143), టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్ టీ వంటి సంఘాలు భారీ ప్రదర్శనలు చేపట్టాయి. కొన్ని చోట్ల కలెక్టరేట్ల ఎదుట బైఠాయించిన జర్నలిస్టులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**జర్నలిస్టుల డిమాండ్లు**

- జీవో 252ను వెంటనే రద్దు చేయాలి లేదా జర్నలిస్టులకు అనుకూలంగా సవరించాలి.
- డెస్క్ జర్నలిస్టులకు కూడా పూర్తిస్థాయి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి.
- చిన్న పత్రికలను, డిజిటల్ మీడియాను ప్రోత్సహించేలా నిబంధనలు ఉండాలి.
- అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

**జర్నలిస్టు సంఘాల హెచ్చరిక**

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జర్నలిస్టు నేతలు స్పష్టం చేశారు.









## అక్రిడిటేషన్ కార్డులు ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటీ..?

**- జర్నలిస్టు విరాహత్ అలీ**



తెలంగాణ రాష్ట్రంలో 4 కోట్ల మంది జనాభా ఉంటే, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులు కేవలం 23 వేల మంది మాత్రమేనని, ఈ 23 వేల మందికి అక్రిడిటేషన్ కార్డులు ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని విరాహత్ అలీ నిలదీశారు. జర్నలిస్టులను ఫీల్డ్ మరియు డెస్క్ అని విభజించి వారి మధ్య చిచ్చు పెట్టొద్దని, గతంలో ఉన్న 23 వేల కార్డులను యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన జర్నలిస్టులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ఈ జీవో 252 ద్వారా జర్నలిస్టుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని, లేదంటే పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# చలి తీవ్రతకు పడిపోతున్న గాలి నాణ్యత

మొదటి పేజీ తరువాయి

డిసెంబర్ 31 వరకు మాత్రమే కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి చలి తగ్గుముఖం పడుతుందని తెలిపింది. జనవరి ప్రారంభంలో సాధారణ ఉష్ణోగ్రతలు ఉండి సంక్రాంతి సమయంలో మళ్లీ చలి పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రాబోయే నాలుగు నుంచి ఐదు రోజులు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కొమురం భీం, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో చలితో పాటు వాయు కాలుష్యం కూడా తీవ్రంగా పెరిగింది. నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 230 దాటగా, అమీన్‌పూర్‌లో 289, గచ్చిబౌలిలో 286 పాయింట్లు నమోదయ్యాయి. మాదాపూర్, విట్టల్‌రావు నగర్, సనత్‌నగర్, కూకట్‌పల్లి, బాలానగర్, సోమాజిగూడ, కోటి, బంజారా హిల్స్, మణికొండ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తదితర ప్రాంతాల్లో కూడా ఎక్యూఐ 200కు పైగా నమోదైంది. చలి, పొగమంచు, వాహనాల పొగ, చెత్త దహనం కారణంగా గాలిలో సూక్ష్మ ధూళికణాలు పెరిగి ముఖ్యంగా ఉదయ వేళల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఏప్రిల్‌లో రెండో విడత "ఇందిరమ్మ ఇళ్లు"

ఖమ్మం, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదవాడికి భద్రత, భరోసా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ గత ప్రభుత్వ పాలనతో పోలిస్తే ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమ పాలనలో స్పష్టమైన తేడా ఉందని, మొన్నటి ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు. ఈ ప్రసంగంలో మంత్రి ఒక కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని, రాబోయే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గానికి మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ క్యాబినెట్ ఈ విషయంలో చిత్తశుద్ధితో ఉందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదవాడి సొంతింటి కల నెరవేర్చే వరకు మాట తప్పే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిందని, ఇది పేద కుటుంబాల్లో ఎంతో సంతోషాన్ని నింపిందని మంత్రి తెలిపారు. దీనితో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం చిత్తశుద్ధితో పేదవాడి గడప వరకు చేరుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆడపిల్లలకు కాస్మెటిక్ చార్జీలను 200 శాతం, మగపిల్లలకు డైట్ చార్జీలను 40 శాతం మేర పెంచామని తెలిపారు. పిల్లల చదువులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. చివరగా, తనకు మద్దతుగా నిలిచిన ఖమ్మం జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టుల అరెస్టులా..?



హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన టీయూడబ్ల్యూజే - టీజేఎఫ్ నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీ లతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేన అన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని మరియు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి కీలక నేతలను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వందేమాతరం కేవలం నినాదం కాదు

హైదరాబాద్, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): వందేమాతరం! వందేమాతర నినాదం ఈ రెండు పదాలు మాత్రమే కాదనీ,%ఎ%దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించేందుకు మన పెద్దలు పడిన తపన, తాపత్రయానికి, ఇందుకోసం వారు చేసిన స్వార్థం లేని త్యాగానికి, మన భరతజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం కోఠిలో వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వివేక్ వర్ధిని కళాశాల ప్రాంగణంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల ప్రత్యేక ఫొటో ప్రదర్శనను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు వందేమాతరం ఒక ప్రేరణాత్మకమైన రణనినాదం అని, ఆ తర్వాత దేశాన్ని నిరంతరం ముందుకు నడిపిస్తున్న స్ఫూర్తి మంత్రం అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పించిన 'వికసిత భారత' నిర్మాణ దిశలోనూ వందేమాతరం కొత్త శక్తిని మనకు అందిస్తుందన్నారు. సుమారు 150 సంవత్సరాల క్రితం మహాకవి బంకించంద్ర చటర్జీ భారతమాత ఔన్నత్యాన్ని,ఆధ్యాత్మిక వైభవాన్ని, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబించేలా 'వందేమాతరం' పదాన్ని సృష్టించారన్నారు. బ్రిటిష్ పాలకులు 'విభజించి పాలించు' విధానంతో దేశాన్ని చీల్చాలని చూసినప్పుడు, వందేమాతరం భారతీయులను ఏకం చేసిందనీ, కులం, మతం, ప్రాంతం అన్న భేదాల్ని మరిచిపోయి దేశమే ప్రథమం మిగిలినవన్నీ తర్వాతే అన్న భావనను పెంచిందన్నారు. ఈ గీతం స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిందనీ,1905 బెంగాల్ విభజన ఉద్యమం నుంచి,1942 క్విట్ ఇండియా ఉద్యమం వరకు ప్రతి పోరాటంలోనూ వందేమాతరం గర్జన మార్మోగిందన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చివరి శ్వాస విడిచే క్షణంలో కూడా ఉచ్చరించిన నినాదం వందేమాతరం.

**అది ఒక పాట కాదు.. అది ఒక త్యాగస్ఫూర్తి**

ఇటీవల గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు మన్ కీ బాత్ కార్యక్రమంలో వందేమాతరం ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ 'ఈ ఒక్క పదంలో దేశభక్తి, ఐక్యత, త్యాగం అన్నీ దాగి ఉన్నాయి' అని చెప్పారు. దురదృష్టవశాత్తు, కొన్ని సందర్భాల్లో ఈ పవిత్ర గీతాన్ని రాజకీయంగా వివాదాస్పదం చేసే ప్రయత్నాలు జరిగాయి. వందేమాతరం అనేది ఓ పార్టీ నినాదం కాదనీ, దేశ సమైక్యతను ప్రతిబింబించే స్ఫూర్తివంతమైన గేయం వందేమాతరం అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తర్వాత మన గడ్డపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడేలా చేసిన సర్దార్ వల్లభ భాయ్ పటేల్ కి మనం ఎప్పటికీ రుణ పడి ఉంటామన్నారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో 1938లో వందేమాతర ఉద్యమం ప్రారంభమైంది. దీనిపై నిజాం ప్రభుత్వం వెంటనే నిషేధం విధించిందనీ, ఓవైపు వందేమాతర ఉద్యమాన్ని అణచివేస్తూనే, వందేమాతర గీతం ఆలపించిన వారిని కళాశాలు, యూనివర్సిటీలనుంచి బహిష్కరించింది, వారిపై కఠినంగా వ్యవహరించిందన్నారు. వందేమాతరం' నినాదంతో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన రామచంద్రరావుగారి ఇంటిపేరు వందేమాతరం అయిందన్నారు. ఇలా ఎందరో మహానుభావులు వందేమాతరం స్ఫూర్తితో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. ఎన్నో త్యాగాలు చేశారన్నారు.హైదరాబాద్ సంస్థానంలో విద్యార్థులతో ప్రారంభమైన ఈ వందేమాతర ఉద్యమంలో ఆ తర్వాత విభిన్న బావ జాలాలు కలిగిన అనేక సంఘాలన్నీ రాజకీయ భావజాలాన్ని పక్కనపెట్టి మరీ 'ఐక్యపోరాటాన్ని' ప్రారంభించాయన్నారు. ఇంతటి ఘనమైన 'వందేమాతరం' చరిత్రను మనమంతా తెలుసుకోవాలని దాని నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. అందుకే ఈ రోజు మనమందరం వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని భారతదేశ పునర్నిర్మాణంలో భాగస్వాములం కావాలన్నారు.

# నాపై కుట్ర జరుగుతోంది

హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): హీరోయిన్ల వస్త్రాధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్‌గా స్పందించి ఆయనకు నోటీసులు ఇచ్చింది. శనివారం శివాజీ విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇండస్ట్రీలో కొంతమందికి నాపై వ్యతిరేకత ఉంది. ఇప్పుడది చాలా క్లియర్‌గా అర్థం అవుతోంది. అందుకే నాపై కుట్ర చేశారని శివాజీ ఆరోపించారు. జూమ్ మీటింగ్ పెట్టుకుని మరీ నాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆవేదన చెందారు. దండోరా సినిమా ఫంక్షన్‌లో తాను చెప్పిన మాటలు నెగిటివ్‌గా కన్వే అవటం వల్ల తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది. మహిళా కమిషన్ ప్రభుత్వ రంగ సంస్థ. దీనిని తప్పకుండా గౌరవించాలనే ఉద్దేశంతో వచ్చాను. వివరణ ఇచ్చాను. ఆవేశంలో నేను మాట్లాడిన రెండు మాటలను తీసుకుని నాపై కుట్ర చేశారు. తండ్రి పాత్రలు చేస్తున్నాను కాబట్టి బిడ్డలకు చెప్పినట్లు చెప్పా. ఇందులో తప్పుడు ఉద్దేశం ఏమీ లేదు. ఏదేమైనా రెండు మిస్టేక్స్ జరిగాయి. ఇప్పటికే సారీ కూడా చెప్పాను. దయచేసి దీనిని ఇంతటితో ఆపేయండి అని మహిళా కమిషన్ ఎదుట శివాజీ వాపోయారు. 'దండోరా' సినిమా ఈవెంట్‌లో మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది.

# దర్గా షరీఫ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



నడికూడ, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): శనివారం నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని మహమ్మద్ ఖాజా ఖాద్రి దర్గా యందు ఉర్సు షరీఫ్ అజాజ్ మదర్ షావలి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఎమ్మెల్యేకి  స్వాగతం పలికారు. అనంతరం చాధర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దర్గాకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని,ఉర్సు షరీఫ్ అజాజ్ మదర్ షావలి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మతసామరస్యాన్ని కాపాడుతూ అందరికీ సమాన న్యాయం అందేలా చూస్తుందని అన్నారు. పరకాల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలించి, దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ముస్తాలపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛ ఇవం హరిత్ విద్యాలయ రేటింగ్ రాష్ట్రస్థాయిలో సెలెక్ట్ అయిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ ని శాలువాతో ఎమ్మెల్యే సన్మానించారు.

# జర్నలిస్టుల అక్రిడేషన్ జీవో 252ను రద్దు చేయాలి

## ములుగు కలెక్టర్‌కు టీఎస్జేయూ వినతి



ములుగు, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ల జారీ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 252ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి, ప్రస్తుత జీవో వల్ల జర్నలిస్టుల ఇబ్బందులను యూనియన్ నాయకులు వివరించారు. ఈ జీవో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉందని, దీనిని పునఃసమీక్షించి పాత పద్ధతిలోనే అక్రిడేషన్లు జారీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షులు చల్లగురుగుల రాజువర్ధన్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాట్ల సంపత్, ఉపాధ్యక్షులు నాగపురి హరినాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల రాజు, కమిటీ సభ్యులు పెండల బిక్షపతి కోటిలింగాచారి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు




ఆత్మకూరు, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి,సంక్షేమ పాలన బిఆర్ఎస్ తోనే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, మళ్ళీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ నే ప్రజలు కోరుకుంటున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.

ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు గిరబోయిన పూలమ్మ సమ్మయ్య, గిరబోయిన అశోక్ లు ఆ పార్టీకి రాజీనామా చేస్తూ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బిఆర్ఎస్ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర హితాన్ని కాపాడగల ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని, రానున్న రోజుల్లో ప్రజల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటు, మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీపై నమ్మకంతో చేరిన ప్రతి కార్యకర్తను పార్టీలో గౌరవంగా చూసుకుంటామని, ప్రజల కోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్లకు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం కార్యక్రమం

## అనసూయ పవర్ ట్రస్ట్ సభ్యులు



భైంసా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ముధోల్ నియోజకవర్గం లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లకు, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లకు అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు అనగా 28-12-2025 ఆదివారం ఉదయం 11 గంటలకు భైంసా మండల కేంద్రంలోని ఎస్.ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనసూయ పవర్ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజా ప్రతినిధులు,బిజెపి ప్రజా ప్రతినిధులు, బిజెపి పట్టణ,గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ట్రస్ట్ సభ్యులు కోరారు.

# పట్టణాలు, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు

## రూ. 17 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

## నూకల రామచంద్రారెడ్డి స్మారక విగ్రహావిష్కరణ

## రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండల కేంద్రంలో భారత స్వాతంత్ర్య నాయకుడు నూకల రామచంద్రా రెడ్డి స్మారక విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ఇతర నేతలు, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఇంచార్జి ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, భారత స్వాతంత్ర్య నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి నూకల రామచంద్రా రెడ్డి స్మారక కాంస్య విగ్రహాన్ని వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించి, పూలమాలలు వేశారు. అనంతరం అదే మండలంలో సుమారు 6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ, బిటి రోడ్లు, వర్షపు నీటి కాలువ, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద 42.28 లక్షలతో ఏర్పాటు చేసిన మాజీ మంత్రివర్యులు దివంగత నూకల రామచంద్రా రెడ్డి గారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాలు గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తూ అన్ని వర్గాల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం అన్నారు, మాజీ మంత్రి నూకల రామచంద్రా రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించే భాగ్యం కలిగినందుకు గాను మనస్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఈ ప్రాంత ప్రజలకు అభినందనలు తెలిపారు. నూకల రామచంద్రా రెడ్డి గురించి, వారి విద్యార్థి దశ నుంచి ఏ రకంగా పోరాటాలు చేశారు. అంచెలంచెలుగా ఒక్కొక్క మెట్టు ఎక్కి ఉన్నతమైన స్థానాన్ని ఎక్కారు అనేది గత స్మృతుల్ని  జరిగిన సంఘటనలను స్మరించుకుంటూ వారి వ్యక్తిత్వాన్ని, వారు పడ్డ కష్టాన్ని, వారు ప్రజల పట్ల చూపించిన ప్రేమ, అభిమానం, ఆత్మీయత విశ్వసనీయతను ఎలా చూపించారు, రాజకీయాలంటే ఇలా కూడా చేయొచ్చనేది ఈరోజు వేదిక మీద ఉన్న ప్రముఖులందరూ గుర్తు చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. భూస్వామిగా వారి నడవడికలో ఎక్కడా చూపించకుండా రాజకీయాల్లో నాలుగు పర్యాయాలు శాసనసభ్యులుగా, ప్రతి ముఖ్యమంత్రి కేబినెట్లో మంత్రిగా ప్రధానమైన పాత్రను పోషించిన వారి ఆస్తుల్ని కాపాడుకోవడం కోసం కాకుండా వారి ఆస్తుల్ని సంరక్షించుకోవడం కోసం కాకుండా చట్టం అనేది భవిష్యత్తు కాలానికి ఉపయోగపడాలని రెవెన్యూ చట్టంలో అనేక సంస్కరణలు తేవడమే కాకుండా గిరిజన ప్రాంతమైన ఈ ప్రాంత ప్రజలకి ముఖ్యంగా లంబాడి సోదరులకి ఉపయోగపడే అనేక చట్టాలతో పాటు చివరికి లంబాడీ కులాన్ని కూడా ఎస్టీ జాబితాలో కావాలని ఆనాటి కేబినెట్లో కొట్లాడి ఒప్పించి దాన్ని ఎస్టీలకు తీసుకువచ్చిన మహానుభావుడు నూకల రామచంద్రా రెడ్డి అని అన్నారు. ఇలా ప్రతి అంశంలో ప్రతి కార్యక్రమంలో తనదైన మార్పుని చూపిస్తూ అంచెలంచెలుగా ఎదిగి ప్రముఖులతో వారికి ఉన్న సాన్నిహిత్యం చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో, సహచర మంత్రులతో సంప్రదించి నూకల రామచంద్రా రెడ్డి పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేస్తా అని అన్నారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, వారి ఆశయాలకు అనుగుణంగా  నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్, దివంగత నూకల రామచంద్రా రెడ్డి మనవరాలు రాధిక రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఎంఎల్సీ తకేళ్ళపల్లి రవీందర్ రావు, ఎంఎల్సీ బస్వరాజు సారయ్య, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్,  డీసీసీ అధ్యక్షుడు భారత్ చందర్ రెడ్డి, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు మాట్లాడుతూ దివంగత నూకల రామచంద్రా రెడ్డి సేవలను ఎంతగానో కొనియాడారు. తదనంతరం డోర్నకల్ మండల కేంద్రంలో ట్యాంక్ బండ్ రెండు కోట్లు, బీటీ రోడ్డు డ్రైనేజ్ పనులకు ఎనిమిది కోట్ల విలువగల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. అదే విధంగా మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ కోసం స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్లు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అన్యాయం చేస్తే సమాజమే సహించదు

## హక్కుల సాధన కోసం అంతు చూసేందుకైనా సంసిద్ధం

## జర్నలిస్టుల భారీ నిరసనలో కలెక్టర్ కు వినతిపత్రం



నల్గొండ, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రజా దీవెన నల్లగొండ టౌన్: తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జా రీచేసిన జీవో ఎంఎస్ నెంబర్ 252 ను వెంటనే సవరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలి స్ట్స టీయూడబ్ల్యూజే 143 జిల్లా అ ధ్యక్షులు గుండగోని జయశంకర్ గౌ డ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్త ర్వులు 252 జీవో సవరణ కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్ల గొండ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టుల హక్కులకు భం గం కలిగించే విధంగా తీసుకొచ్చిన జీఓ 252లోని నిబంధనలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. జీఓ 252లో స్పష్టతలేని నిబంధన లు, అక్రిడిటేషన్లలో భారీ కోతలు, మీడియా అక్రిడిటేషన్ కార్డు మీడి యా కార్డు పేరుతో గందరగోళం సృ ష్టించారని ఆరోపించారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టుల మధ్య విభేదాలు స ృష్టించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేబుల్ ఛానెల్స్, పార్ట్‌టైం రిపోర్టర్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులకు జరు గుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, అర్హులైన ప్రతి జ ర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా జీ ఓ 252ను పునఃసమీక్షించి సవరిం చాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించక పోతే, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా దీర్ఘకాలిక ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమస్త జర్నలిస్టుల హక్కుల కోసం యూనియన్లకు అ తీతంగా, ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. జర్నలిస్టులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని, హక్కుల సా ధన కోసం ప్రాణ త్యాగానికైనా జ ర్నలిస్టులు సిద్ధంగా ఉన్నారన్నారు. జీ ఓ 252లో గజిబిజి నిబంధనలతో జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను మానుకో వాలన్నారు. మీడియా అక్రిడిటేషన్ కార్డు -- మీ డియా కార్డు పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని, ఏ కార్డు వల్ల ఏ ప్ర యోజనం అనే స్పష్టత లేదని విమ ర్శించారు. కొత్త నిబంధనలతో 10 వేలకుపైగా అక్రిడిటేషన్ల కోత పడే ప్రమాదం ఉందని, రిపోర్టర్లు-- డెస్క్ జర్నలిస్టుల మధ్య విభేదాలు సృ ష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. కేబుల్ ఛానెల్స్, పా ర్ట్‌టైం రిపోర్టర్లకు తీవ్ర అన్యాయం జ రగనుందని, ఇండిపెండెంట్ జర్నలి స్టుల అనుభవం 10 నుంచి 15 ఏళ్ల కు పెంపుపై అభ్యంతరం వ్యక్తం చే శారు. మెజారిటీ జర్నలిస్టులు వ్యతి రేకిస్తున్న జీ ఓ 252ను వెంటనే సవ రించాలని, ప్రభుత్వం స్పందించ క పోతే దీర్ఘకాలిక ఆందోళనలకు వేన కాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జి ల్లా ప్రధాన కార్యదర్శులు వీరస్వా మి, శివకుమార్, అన్నబోయిన మ ట్టయ్య, మామిడి దుర్గా ప్రసాద్, బి.జనార్ధన్ రెడ్డి, నాగేశ్వర్ రావు, మేకల వరుణమ్మ, సురేష్, లక్ష్మీనా రాయణ, సత్య విజయ్, గాదె రమే ష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షు డు వెంకట్ రెడ్డి, గాలెంక గురుపా దం, రవికుమార్, లక్ష్మీనారాయణ, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరమణ, ముచర్ల శ్రీనివాస్ గౌడ్, కారింగ్ శ్రీనివాస్ గౌ డ్, దండపల్లి రవికుమార్, మధు, డిజెటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పగ డా ల సురేష్, ప్రధాన కార్యదర్శి తాడిశె ట్టి లక్ష్మీ నారాయణ, సభ్యులు న రేందర్ రాజు, అజీజ్, నాగరాజు, సురేష్ వెంకటేశ్వర్లు జాకీర్, శ్రీనివా స్, సాయి, శీను, గిరి, టియూడబ్ల్యు జే నియోజక అధ్యక్షులు లక్షణ్, కొ మ్ముగిరి, ప్రసన్న, ఆంజనేయులు, భిక్షం, వినోద్, సైదులు, జర్నలిస్టు లు, డెస్క్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అఖిల్ రెడ్డి పుట్టిన రోజు 22 మందికి దుస్తుల దానం





భైంసా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): నిర్మల్ జిల్లాకు చెందిన అదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఇప్ప ముత్యం రెడ్డి కుమారుడు ఇప్ప అఖిల్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అమ్మ నాన్న ఫౌండేషన్ వారికి సంప్రదించి పుట్టినరోజు సందర్భంగా తన వంతు ఆర్థిక సహాయం అందించి నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్ మండల కేంద్రంలోనీ చుట్టుపక్కల వివిధ ప్రాంతాలలో గల నిరుపేదలకు, యాచకులు, రెండు కాళ్ళు లేని ఒక నిరుపేద వికలాంగ కుటుంబానికి దాదాపు 22 మందికి దుస్తుల పంపిణీ చేశారు. ఆర్థిక సహాయం పొందిన వికలాంగ కుటుంబంలో సహాయం చేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

**హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్ స్టడ్స్ ఏర్పాటు చేయాలి**

**అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే**



వర్ధన్నపేట, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. హన్మకొండ వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి ఉనికిచెర్ల వరకు ఉన్న రహదారిలో వరుసగా జరుగుతున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో, నేడు నగర మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రోడ్డు ఇంజనీరింగ్ లోపాల వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. పోలీసు అధికారిగా తన అనుభవాన్ని ఉపయోగించి మున్సిపల్, ఆర్ అండ్ బి, పోలీసు శాఖల అధికారులతో కలిసి సమస్యలను సమీక్షించి అవసరమైన సూచనలు చేశామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకుంటామని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేపు జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో సమయం దొరికినప్పుడు ఖచ్చితంగా రోడ్డు ప్రమాదాల గురించి సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు శాశ్వతంగా పరిష్కార దిశగా కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆర్ అండ్ శాఖ అధికారులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రింగ్ రోడ్ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



వరంగల్ జిల్లా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఇన్నర్ రింగ్ రోడ్ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో భాగంగా ఖిలా వరంగల్, ఉర్స్, ఎనుమాముల, గొర్రెకుంట ప్రాంతాల మీదుగా నిర్మాణంలో ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు కారణంగా భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన చెల్లించేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా, నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్ పూర్తి కావడం ద్వారా నగర ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు సమగ్ర నగరాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సుమా, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో విశ్వ ప్రసాద్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ఐక్యతకు బలమైన సంకేతం నేతల మధ్య పరస్పర సత్కారాలు



కామారెడ్డి, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఐక్యత, పరస్పర గౌరవానికి నిదర్శనంగా శనివారం కీలక నేతల మధ్య మర్యాదపూర్వక భేటీలు జరిగాయి. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రతిస్పందనగా కైలాష్ శ్రీనివాస్ కూడా ప్రస్తుత డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ని శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ భేటీ జిల్లా కాంగ్రెస్‌లో సీనియర్ జూనియర్ నాయకుల మధ్య సమన్వయానికి ప్రతీకగా నిలిచింది. అనంతరం కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డిని కూడా వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే క్రమంలో, కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన కామారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడెం శ్రీనివాస్ రెడ్డి డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గారిని శాలువాతో సత్కరించారు. అలాగే జిల్లా సీనియర్ నాయకులు నయుంని కూడా కలిసిన డిసిసి అధ్యక్షులు మల్లికార్జున్ గారు, ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ గారితో పాటు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సాయి పటేల్, NRI భుజంగ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ భేటీలు, సత్కార కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు.

# ఇంచెంచెరువుపల్లి గ్రామ సభలో కీలక నిర్ణయం

**మహిళా సంఘం భవనానికి స్థల కేటాయింపుకు హామీ**

**మహిళా సంఘం విన్నపానికి సర్పంచ్ సానుకూల స్పందన**





వెంకటాపూర్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): మండల పరిధిలోని ఇంచెంచెరువుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ అధ్యక్షతన అత్యవసర గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రత్న స్వరూప, వీఓఏ తడుక రాజేశ్వరి మరియు సంఘం సభ్యులు కలిసి మహిళా సంఘం కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సర్పంచ్‌కు వినతి అందజేశారు. దీనిపై సర్పంచ్ సపవత్ ఇశ్రా సానుకూలంగా స్పందిస్తూ, గ్రామ పురోగతిలో మహిళా సంఘాల ప్రాధాన్యతను గుర్తించి, గ్రామ పెద్దలతో చర్చించి భవన నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం నాయకురాలు, గ్రామ పెద్దలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్టిఐ చట్టం మీద అవగాహన



జనగాం జిల్లా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): సమాచార హక్కు చట్టం 2005, ద్వారా పౌరులకు ప్రభుత్వ సంస్థల నుండి సమాచారం పొందే హక్కును కలిగిందని తద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని అదనపు కలెక్టర్ ( రెవిన్యూ ) బెన్ షాలోమ్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్, రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వివిధ శాఖల అధికారులకు కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో ఆర్టిఐ చట్టం మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌లి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు ఆర్టిఐ (సమాచార హక్కు) చట్టంపై పూర్తి అవగాహన తప్పనిసర అని పేర్కొన్నారు. ప్రజలు అడిగే సమాచారాన్ని సరైన సమయంలో, ఖచ్చితత్వంతో అందించాలీ అంటే చట్టం లో ఉన్న అన్ని అంశాలు క్షుణ్ణంగా తెలిసి ఉండాలన్నారు. ప్రతి కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అప్పీలేట్ అథారిటీలు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ శిక్షణలో భాగంగా రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ మార్గం కుమార్ స్వామి, ట్రైనర్ మోహన క్రిష్ణ జిల్లా కోఆర్డినేటర్, లు చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు తీసుకోవలిసిన చర్యల పైన, చట్టంలోని నిబంధన లను అధికారులకు వివరించారు.

# మేడారం భక్తులకు శుభవార్త

**భూపాలపల్లి డిపో నుండి ప్రత్యేక బస్సులు**

**మహాలక్ష్మి పథకం వర్తింపు**

**మహిళలకు ఉచిత ప్రయాణం**

**డిపో మేనేజర్ ఎ. ఇందు**



జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ భూపాలపల్లి డిపో కీలక నిరయం తీసుకుంది. జాతరకు ముందే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డిపో మేనేజర్ ఎ. ఇందు వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు.

**ప్రయాణ మార్గం మరియు సౌకర్యాలు:**

ఈ ప్రత్యేక బస్సులు భూపాలపల్లి డిపో నుండి బయలుదేరి చెల్పూర్, ఘనపూర్, ములుగు, గోవిందరావుపేట, పస్రా, తాడ్వాయి మీదుగా మేడారం చేరుకుంటాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈ రూట్‌లో క్రమబద్ధమైన సమయాల్లో బస్సులను నడపనున్నట్లు ఆమె తెలిపారు.

**బస్సుల వేళలు:**

బయలుదేరే స్థలం సమయాలు (ఉదయం/సాయంత్రం)

భూపాలపల్లి నుండి మేడారం 08:00 AM, 09:00 AM, 04:10 PM, 05:10 PM

మేడారం నుండి భూపాలపల్లి 10:40 AM, 11:40 AM, 06:45 PM, 07:45 PM

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఈ ప్రత్యేక మేడారం బస్సుల్లోనూ వర్తిస్తుందని డిపో మేనేజర్ స్పష్టం చేశారు. దీనివల్ల మహిళలు, బాలికలు మరియు ట్రాన్స్‌జెండర్లు ఎలాంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా మేడారం వెళ్లి వనదేవతలను దర్శించుకోవచ్చు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే, భక్తుల అవసరాలకు అనుగుణంగా అదనపు ట్రిప్పులు మరియు మరిన్ని బస్సులను నడపడానికి సిద్ధంగా ఉన్నామని మేనేజర్ ఇందు తెలిపారు. జిల్లా ప్రజలు మరియు పరిసర ప్రాంతాల భక్తులు ఈ సువరావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్షేమంగా మేడారం వెళ్లి రావాలని ఆమె కోరారు.

# సర్పంచ్‌గా శ్రీలత లక్ష్మణ్ బాబుకు వేలమ సంఘం సన్మానం



ఏటూరునాగారం, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఘన విజయం సాధించిన కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబుని వేలమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేలమ సంఘం నాయకులు మాట్లాడుతూ, శ్రీలత లక్ష్మణ్ బాబు సర్పంచ్‌గా గెలవడం గ్రామ ప్రజల నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సేవే పరమావధిగా, గ్రామ వికాసమే ధ్యేయంగా ఆమె పాలన సాగాలని వారు ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద, ఎగువ వర్గాలనే తేడా లేకుండా అందరికీ న్యాయం చేస్తూ, ఏటూరునాగారాన్ని జిల్లాలోనే ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. వేలమ సంఘానికి గర్వకారణంగా నిలిచిన ఆమె, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు. మీ నాయకత్వంలో గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, మీరు ఇష్టపడే అభయాంజనేయ స్వామి ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని మనసూర్తిగా కోరుకుంటున్నాము అని వారు పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేలమ సంఘం ముఖ్య నాయకులు, ప్రతినిధులు మరియు శ్రీలత లక్ష్మణ్ బాబు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆమెకు గ్రామ ప్రజల నుండి కూడా పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్, ఉప సర్పంచ్

**గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయం**

**ఎస్ఐ చల్ల రాజుతో ప్రజా ప్రతినిధుల భేటీ**

**శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి**

**పోలీసు అధికారులను కోరిన సర్పంచ్**



వెంకటాపూర్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): మండల పరిధిలోని ఇంచెన్ చెరువు పల్లి గ్రామ నూతన సర్పంచ్ సపవట్ ఇశ్ర మరియు ఉప సర్పంచ్ సపవట్ సరిత (రాజు) శనివారం వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు మరియు పలు సమస్యలపై వారు చర్చించగా, ఎస్ఐ సానుకూలంగా స్పందిస్తూ గ్రామంలో ఏవైనా చిన్నపాటి వివాదాలు లేదా సమస్యలు తలెత్తితే వాటిని స్థానికంగానే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే విధంగా పారదర్శకమైన పరిపాలన అందించాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి మరియు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఎస్ఐ భరోసా ఇచ్చారు.

# చట్టాలు పాలకుల చుట్టాలైతే ప్రజలకు ఒరిగేదేమిటి..?

భారతదేశంలో రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం "చట్టం ముందు సమానత్వం"(ఈక్వలిటీ బిఫోర్ ది లా) మరియు "చట్టాల సమాన రక్షణ" (ఈక్వల్ ప్రొటెక్షన్ ఆఫ్ లాస్) అనే సూత్రాలు స్పష్టంగా పేర్కొన్నాయి.అంటే దేశంలో ధనికుడైనా,పేదవాడైనా, పాలకుడైనా,సామాన్యుడైనా చట్టం అందరికీ ఒక్కటే.కానీ, వాస్తవికతలో ఇది ఎలా ఉందంటే చట్టాలు పాలకుల చుట్టాలు "లా" పనిచేస్తూ సామాన్య ప్రజలకు న్యాయం అందని ద్రాక్షలా చేస్తున్నది చాలా వరకు నిజమని చెప్పుకోవాలి.ఎందుకంటే వాస్తవికతలో చట్టం ముందు అందరూ అసమానమే అనేది అసామాన్యంగా కనిపిస్తుంది కాబట్టి.

**చట్టం దగ్గర ధనికులు వర్సెస్ పేదలు**

ధనవంతులు,రాజకీయ నాయకులు లేదా వారి చుట్టాలు చట్టాల విషయంలో (పెద్ద పెద్ద కేసుల్లో) సులభంగా బెయిల్ పొందుతారు.ధనికుల కేసులు ఖరీదైన లాయర్లు హైయర్ చేసుకుంటారు,కేసులు సంవత్సరాల తరబడి లాగిస్తారు. సామాన్యుడు మాత్రం చిన్న చిన్న పొరపాట్లకు జీవితం మొత్తం జైలులోనే గడిపేస్తాడు.ఇది సినిమా కథ కాదు,నిజ జీవితంలో నిత్యం జరిగే సామాన్యుడి సంఘర్షణ.మీరు కింది కోర్టుల నుండి సుప్రీం కోర్టు వరకు నిశితంగా గమనిస్తే పెద్ద పెద్ద అవినీతి,హత్యా,అత్యాచారం కేసుల్లో రాజకీయవేత్తలు,వారి పిల్లలు తప్పు చేసినా నిరభ్యంగా బయట తిరుగుతుంటే,చిన్న చిన్న నేరాలకు పేదలు ఏళ్ల తరబడి జైల్లల్లో మగ్గుతూ శిక్ష అనుభవిస్తారు.భారత రాజకీయ కుటుంబాలు మొదటి నుండి చట్టాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నెహ్రూ కుటుంబం దగ్గర నుండి మొదలుకొని నేడు దేశాన్ని, రాష్ట్రాలను పాలిస్తున్న,గతంలో పాలించిన నేతల వరకు అందరూ ఆ తానులో ముక్కలే.ఇటీవలి కొన్ని నివేదికల ప్రకారం (ఏడీఆర్ రిపోర్ట్‌లు) లోక్‌సభలో 20-30% ఎంపీలు డైనస్టీల నుంచి వచ్చినవారే కావడం పరిస్థితికి అద్దం పడుతుంది.ఇలాంటి అసంబద్ధ వ్యవస్థ అవినీతిని పెంచుతుంది.ఎందుకంటే వారి కుటుంబ ప్రయోజనాలు ప్రజాప్రయోజనాల కంటే ముందు ఉంటాయి కాబట్టి.

**న్యాయ వ్యవస్థలో కూడా అసంతృప్తి**

ఈ దేశంలో ఏ వర్గం ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన న్యాయ వ్యవస్థలో కూడా అసంతృప్తి నెలకొంది. సుప్రీం కోర్టు,హైకోర్టుల్లో జడ్జిల నియామకాల్లో కొలీజియం సిస్టమ్ వల్ల కుటుంబ సంబంధాలు,రాజకీయ పరిచయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయనే ఆరోపణలు ఉన్నాయి.ఈ విధానం కూడా సామాన్యులకు న్యాయం అందకుండా దూరం చేస్తుంది. అత్యధిక అసమానత్వం ఉన్న దేశాల్లో రూల్ ఆఫ్ లా బలహీనపడుతుంది.అందుకే అవినీతి కేసుల్లో రాజకీయ వేత్తలు సులభంగా బయటపడతారు.కానీ, సామాన్యుడు చిన్న తప్పు చేసినా కూడా కఠిన శిక్ష పడుతుంది. ప్రధాని మోదీ 2024 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కుటుంబ వాదాన్ని విమర్శించారు.కానీ, అన్ని పార్టీల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది.

**రాజ్యాంగం చూపే పరిష్కారాలు అమలు తీరు**

రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చింది.పిల్ (పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) వంటి సాధనాలతో సామాన్యులు న్యాయం కోసం పోరాడగలరు.రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అసమానత్వాన్ని తగ్గించే ప్రయత్నాలు.కానీ,వాటిని అమలు చేసే పాలకులు కుటిల రాజకీయ తంత్రంతో తమ రాజకీయ స్వార్ధ ప్రయోజనాలకు వాడుకుంటూ రాజ్యాంగ సూర్తి తుంగలో తొక్కేస్తున్నారు.ఇక్కడ మార్పు జరగాలంటే ఓటు హక్కును సరిగ్గా ఉపయోగించడం, అవినీతి వ్యతిరేక ఉద్యమాలు చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థను బలోపేతం చేయడం అవసరం ఉంది.మొత్తంగా చట్టాలు కాగితంపై సమానంగా ఉన్నా, అమలులో పాలకులు మరియు ధనికులకు అనుకూలంగా మారుతున్నాయి.ఇది ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించే ప్రమాదం ఉంది. ఇకకైనా దేశ ప్రజలు కళ్ళు తెరవాల్సిన అవసరం ఉంది. పాలకులు కూడా తమ ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తిపలికి, రాజ్యాంగబద్ధమైన అంశాలలో నిజమైన సమానత్వం కోసం కృషి చేయాలి.ప్రజలు కూడా తమకు జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ సకాలంలో మేలుకోవాలి.



- గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# యూరియా బుకింగ్ యాప్ వినియోగంలో జిల్లా రైతులు ముందంజ

**అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్**



జనగాం జిల్లా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులకు సులభంగా, పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతుందని అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షోలం , జిల్లా వ్యవసాయ అధికారి అంబిక సోని ఇతర వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి జనగాం, లింగాలఘణపూర్ మండలాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా విక్రయ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల్లో యూరియా సంచులు సరిపడినంతగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే డీలర్లకు సూచనలు జారీ చేస్తూ, యాప్ ద్వారా బుకింగ్ ఐడీతో రైతు వచ్చిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా, తక్షణమే యూరియా విక్రయ ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. బుకింగ్ ఉన్నప్పటికీ విక్రయంలో ఆలస్యం చేయడం లేదా పెండింగ్‌లో ఉంచద్దని హెచ్చరించారు. అదేవిధంగా రైతులు తాము సాగు చేస్తున్న పంటకు మాత్రమే, పంట దశను బట్టి అవసరమైన సమయంలోనే యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులందరూ యూరియా కొనుగోలుకు తప్పనిసరిగా యూరియా బుకింగ్ యాప్‌ను వినియోగించాలన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరానికి అనుగుణంగా సరిపడిన నిల్వలు అందుబాటులో ఉంటాయన్నారు. డిజిటల్ సాంకేతికత ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడంలో, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఈ యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని ఏ అధికారిక ఎరువుల విక్రయ కేంద్రం నుండైనా యూరియాను సులభంగా బుక్ చేసుకునే సౌకర్యం కలిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చున్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పంట దశను బట్టి అవసరమైన సమయంలో మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలన్నారు. మొత్తం సీజన్ అవసరాన్ని ఒకేసారి బుక్ చేసుకోవడానికి తొందరపడవద్దన్నారు. రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా గమనించదగ్గ విషయం ఏమిటంటే జనగాం జిల్లా రాష్ట్రంలోనే యూరియా బుకింగ్ యాప్ వినియోగంలో ముందంజలో ఉందన్నారు. కేవలం 5 రోజుల వ్యవధిలో (22 డిసెంబర్ 2025 నుంచి 26 డిసెంబర్ 2025 వరకు) జనగాం జిల్లాలో మొత్తం 50,377 యూరియా సంచులు యాప్ ద్వారా బుక్ చేయబడటం రైతుల విశ్వాసాన్ని, యాప్ విజయాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందన్నారు.



**యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులకు కలిగిన ముఖ్య ప్రయోజనాలు:**

పీపిబి (PPB) నంబర్ మరియు పంట వివరాలతో సులభంగా బుకింగ్

అందుబాటులో ఉన్న యూరియా కోటా స్పష్టంగా కనిపించడం

సమీపంలోని అధికారిక విక్రయ కేంద్రం ఎంపిక అవకాశం

ఎరువుల దుకాణాల వద్ద రద్దీ తగ్గింపు

అక్రమాలు, ద్వంద్వ విక్రయాలకు అడ్డుకట్ట

రైతుల సమయం మరియు ఖర్చు ఆదా

# ఎమ్మెల్యే, ఎంపీలను కష్టపడి గెలిపించుకున్నం

**అభివృద్ధి పనులు చేసుకుందాం: బాజీరావు**



బైంసా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్):బీముధోల్ నియోజకవర్గం లోకేశ్వరం మండలంలోని హత్గం, తానూర్ మండలంలోని హిప్నెల్లి,కుబీర్ మండలంలోని న్యూ సాంవ్లీ, నర్సాపూర్ మండలంలోని నందనం గ్రామాల నుండి మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్లుగా, ఉప సర్పంచ్లుగా, వార్డు మెంబర్లు ఎన్నుకోబడి మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన వారిని అభినందించి, సన్మానించిన బిజెపి ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాజీరావు. ఈ సందర్భంగా బాజీరావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలను కష్టపడి గెలిపించుకున్నామని అదేవిధంగా అని అభివృద్ధి పనులు చేసుకుందామని బిజెపి బలపరిచిన అభ్యర్థులు గెలిచిన సర్పంచ్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్లు, ఉప సర్పంచ్ లో,మెంబర్లు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

**భాజపా పట్టణ అధ్యక్షులు రాము**



బైంసా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): సస్పెన్షన్ కు గురైన శానిటరీ ఇన్స్పెక్టర్ అనీష్ తో పాటు మరికొందరు అధికారులపై ఉన్న అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని భాజపా డిమాండ్ చేసింది. శనివారం బల్దియా మేనేజర్ గౌరీస్ కు వినతి పత్రం అందజేశారు. రెండు నెలల క్రితం కార్మికుల నుంచి వసూలు చేసిన సొమ్ము పై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైంసా పట్టణ అధ్యక్షులు రాము, కపిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి.శ్రీనివాస్



వెంకటాపూర్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): శనివారం తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి.అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు, వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని పాలంపేట గ్రామ వాస్తవ్యులు ఎల్లబోయిన కుమార్ మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీల బియ్యం వారి కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారితోపాటు గ్రామకమిటీ అధ్యక్షులు జనగాం నాగరాజు, సీనియర్ నాయకులు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు రౌతు దేవేందర్, శ్రీను, సహదేవ్, దున్నపోతుల సతీష్, సాంబయ్య, రమేష్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఓ టీ పీ చెప్పి గ్యాస్ సిలిండర్ పొందండి

**గ్యాస్ సిలిండర్ వాడే వారికి కేంద్రం స్ట్రిక్ట్ రూల్ ఫాలో కాకపోతే సిలిండర్ రాదు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఇంటి వంటలకు అవసరమైన గ్యాస్ సిలిండర్ వాడుతున్నవారందరికీ ఒక ముఖ్యమైన అప్‌డేట్. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిరయంతో, సిలిండర్ డెలివరీకి ఓ.టీ.పీ./డి.ఏ.సి. తప్పనిసరి అయింది. ఈ నియమాన్ని పాటించకపోతే, మీ బుకింగ్ రద్దు చేసేసి, చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వకపోవచ్చు. ముఖ్యంగా, సబ్సిడీ పొందాలంటే ఈ ప్రక్రియలో ఎట్టి పొరపాటూ చేయకూడదు. 2025 డిసెంబర్ 20 నుంచి దేశవ్యాప్తంగా ఈ నియమాలు ఖచ్చితంగా అమలులోకి వచ్చాయి. ఇది సరఫరాలో మోసాలను అరికట్టడానికి, పారదర్శకతను పెంచడానికి ఉపయోగపడుతుంది....

**ఎందుకు ఈ ఓటీపీ విధానం తప్పనిసరి ?**

గత కొన్ని సంవత్సరాలుగా గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అక్రమాలు, దుర్వినియోగాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఇచ్చే సబ్సిడీలు తప్పించుకోవడం, బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు %--% ఇలాంటి సమస్యలు తగ్గించాలని కేంద్రం ఈ విధానాన్ని బలోపేతం చేసింది. ఇప్పుడు, సిలిండర్ బుక్ చేసిన తర్వాత మీ రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చే 4-అంకెల ఓటీపీని డెలివరీ సిబ్బందికి చెప్పాలి. వారు తమ యాప్‌లో దాన్ని ఎంటర్ చేసి ధృవీకరిస్తారు, ఇది జరిగితేనే సిలిండర్ అందిస్తారు. లేకపోతే, డెలివరీ ఆగిపోతుంది మరియు ఒకవేళ మీరూ ముందే ఆన్లైన్ లో చెల్లింపు చేసినచో మీ చెల్లింపు మొత్తం వృథా అవుతుంది. ఇంకా, ఈ సంవత్సరం నుంచి ఈ-కేవైసీ కూడా తప్పనిసరి. మీ ఆధార్ కార్డ్‌ను లింక్ చేసి, బయోమెట్రిక్ ధృవీకరణ చేయాలి. దీని ద్వారా మీ డేటా సరైనదేనా అని చెక్ చేస్తారు. మీరు ఇంకా చేయకపోతే, ఆన్‌లైన్ బుకింగ్ బ్లాక్ అవుతుంది.



**సిలిండర్ బుక్ చేసే సులభమైన మార్గాలు?**

గ్యాస్ సిలిండర్ బుక్ చేయడం ఇప్పుడు చాలా సులభం. మీరు స్మార్ట్‌ఫోన్ వాడుతున్నా, బేసిక్ ఫోన్ వాడుతున్నా – ఏ పద్ధతి అయినా పని చేస్తుంది. ముఖ్య గ్యాస్ కంపెనీల వారీగా మిస్డ్ కాల్ నంబర్లు ఇలా ఉన్నాయి. హిందుస్తాన్ పెట్రోలియం (HP గ్యాస్): 94936 02222కు మిస్డ్ కాల్ ఇవ్వండి. బుక్ చేసిన వెంటనే మీ మొబైల్‌కు కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది, అందులో ఓటీపీ (డి.ఏ.సి.) కూడా ఉంటుంది. డెలివరీ సమయంలో దాన్ని డెలివేరి బాయ్ కు షేర్ చేయండి. ఇతర ఆప్షన్లు: వాట్సాప్ (కంపెనీ నంబర్‌కు 'రిఫిల్' పంపండి), mylpg.in వెబ్‌సైట్ లేదా యాప్ ఉపయోగించండి. రాయితీ మరియు రాష్ట్ర స్కీమ్‌లు – మరిన్ని ప్రయోజనాలు (LPG Gas Cylinder Rule).? కేంద్రంలో PMUY కింద BPL కుటుంబాలకు 14.2 కేజీ సిలిండర్‌కు 300 రూపాయల సబ్సిడీ ఇస్తున్నారు, సంవత్సరానికి 9 రిఫిల్స్ వరకు. తెలంగాణలో మహాలక్ష్మి స్కీమ్ : సిలిండర్‌ను 500 రూపాయలకు కొనుగోలు చేసుకోవచ్చు. ఇది మహిళా సాధికారతకు భారీ ఊరట. ఈ నియమాలు పాటించడం ఎందుకు ముఖ్యం (LPG Gas Cylinder Rule).?

ఈ మార్పులు మీ సౌకర్యానికి మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థకు కూడా లాభదాయకం. మోసాలు తగ్గుతాయి, సరైన వారికి సబ్సిడీ చేరుతుంది. ఇప్పటికే చాలా మంది ఓటీపీ వాడుతున్నారు, కానీ అవగాహన పెంచాలి. మీ గ్యాస్ ఏజెన్సీలో లేదా ఆన్‌లైన్‌లో e-KYC పూర్తి చేసుకోండి, ఇది పూర్తిగా ఉచితం. గ్యాస్ సిలిండర్ వాడుతున్న ప్రతి కుటుంబం ఈ రూల్స్‌ను పాటిస్తే, మీరు మాత్రమే కాకుండా, సమాజం మొత్తంకు ప్రయోజనపడుతుంది.

# డ్రగ్స్ కేసులో కేసీఆర్ కుటుంబ "వాంగ్మూలాలు ఏమయ్యాయి..?"

**రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన బండి సంజయ్**

**ఈగల్ టీం తీరుపై అనుమానాలు వ్యక్తం**

**అకున్ సబర్వాల్ నివేదికపై విచారణ చేపట్టాలని డిమాండ్**



హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): డ్రగ్స్ కేసుల విషయంలో రాష్ట్ర పభుత్వం సీరియస్‌గా వ్యవహరించడం లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తుల పేర్లు, సినీ ప్రముఖులు ఉన్నారంటూ బండి సంజయ్ బాంబు పేల్చారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులకు డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందన్నారు. ఆ కుటుంబ సభ్యులు సైతం తమతో కలిసి డ్రగ్స్ తీసుకున్నారని డ్రగ్స్ కేసులో పట్టుబడి నిందితులు ఆనాడు అకున్ టీం ఎదుట వాంగ్మూలమిచ్చారని పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకొస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని భయపడ్డ నాటి సీఎం కేసీఆర్ అకున్ సబర్వాల్‌ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని తెలిపారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదికను, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్ మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారని మండిపడ్డారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీంకు అప్పగించలేదని, వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదని తెలిపారు. ఈ మేరకు బండి సంజయ్ శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న "ఈగల్" టీం వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈగల్ టీం విచారణ తీరుపైనా ఈ సందర్భంగా బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈగల్ టీంకు నిజంగా లీగల్‌గా అధికారాలున్నాయా? అని ప్రశ్నించారు. ఈగల్ టీంలో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు అధికారులు మాత్రం డబ్బులకు అమ్ముడుపోయి డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని తెలిపారు. ఇటీవలి ఈగల్ టీం దాడిలో పెడ్లర్ల నుండి డ్రగ్స్ కొనుగోలు చేసిన ఇంతవరకు ఎందుకు అరెస్ట్ చేయలేదు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విచ్చల విడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు. అట్లా కాకుండా డ్రగ్స్ కేసు విచారణ తేల్చకుండా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసినంత మాత్రాన రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కానేకాదని స్పష్టం చేశారు.

# పుష్ప-2 తొక్కిసలాట కేసులో ఊహించని మలుపు

**అల్లు అర్జున్‌పై 100 పేజీల చార్జిషీట్ దాఖలు**

**ఏ 11గా ఐకాన్ స్టార్.. బౌన్సర్లు, మేనేజర్‌పై కూడా కేసులు**




హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఇందులో సినీ హీరో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో పాటు 23 మందిపై అభియోగాలు మోపారు. ఈ చార్జిషీట్‌లో అల్లు అర్జున్ ఏ-11గా ఉన్నారు. సంధ్య థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగినట్లు నిర్ధారించారు. ఈ మేరకు థియేటర్ అల్లు అర్జున్, ఆయన మేనేజర్, వ్యక్తిగత సిబ్బందితో సహా 8 మంది బౌన్సర్ల పేర్లే చార్జిషీట్‌లో చేర్చారు. ఈ మేరకు నాంపల్లి న్యాయస్థానానికి 100 పేజీల చార్జిషీట్‌ను పోలీసులు సమర్పించారు. ఇందులో అల్లు అర్జున్‌పై నేర అభియోగాలు మోపడంతో శిక్ష తప్పదా అన్న చర్చ సినీ వర్గాల్లో జరుగుతోంది.

**ఐకాన్ స్టార్ చేయి ఊపడం వల్లే..!**

గత ఏడాది డిసెంబర్ 4న రాత్రి 'పుష్ప-2' సినిమా బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రావడం తొక్కిసలాటకు కారణమని పోలీసులు తేల్చారు. ఆయన సినిమా టాకీస్ వద్దకు రాగానే కారు రూఫ్ ఎక్కి చెయ్యి ఊపుతూ అభివాదం చేయడం వల్ల ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో మహిళ రేవతి (35) ప్రాణాలు కోల్పోగా ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 2024 డిసెంబర్ 13న నటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత అతడిని నాంపల్లి కోర్టుకు తరలించగా న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే, అదే రోజు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో మరుసటి రోజు ఉదయం ఆయన విడుదలైన విషయం తెలిసిందే.

# టీజీ ఎన్పీడీసీఎల్‌కు జాతీయ స్థాయి భద్రతా అవార్డు

**భద్రతా ప్రమాణాలకు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్**

**నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ గుర్తింపు**




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సేఫ్టీ అవార్డ్స్-2024 సంవత్సరానికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డ్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్‌కు దక్కిందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. వినియోగదారులకు అందించే సేవల పరంగా, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, ప్రమాదాలను తగ్గించడనికి తీసుకుంటున్న చర్యలకు భద్రతా ప్రమాణాల పెంపు, ఉద్యోగులకు అందించే శిక్షణలో గాను ఉత్తమ పనితీరును కనబరిచినదుకు ఈ అవార్డు వరించిందని తెలిపారు. ఈనెల 23న ముంబయిలో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో సీఈ (ఐటీ, ప్లానింగ్) ఎన్. శ్రవణ్ కుమార్, వరంగల్ డీఈ టెక్నికల్(సేఫ్టీ ఆఫీసర్) వై. రాంబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డ్‌ను అందచేశారు. ఈ సందర్భాంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య, భద్రతా విధానం కొరకు భద్రతా అంశాలపై SOP (ప్రామాణిక నిర్వహణ విధానం) ఇందులో భాగంగా రిస్క్ మేనేజ్‌మెంట్ పాలసీ, ఉద్యోగుల సంక్షేమ విధానం, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక విధానం, మెడికల్ పాలసీ అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే శిక్షణ కార్యక్రమాలు, భద్రతా అంశాలపై మాన్యువల్స్, పోస్టర్లు, కరపత్రాలు ద్వారా భద్రతా అంశాలపై సూచనలు తెలుపుతున్నామని, భద్రతా వారోత్సవాల నిర్వహణ చేపడుతున్నామని చెప్పారు. సెక్షన్ స్థాయిలో, సబ్-డివిజన్ స్థాయిలో, డివిజన్ స్థాయిలో, సర్కిల్ స్థాయిలో విద్యుత్ ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు ప్రతి నెలా భద్రతా సమీక్షలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని అన్నారు. 5580 మంది ఉద్యోగులకు భద్రతా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులు787 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతిరోజూ భద్రతా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో పనులను ప్రారంభించే ముందు భద్రతా చర్యలపై అవగాహన కల్పించడానికి 'పెప్ టాక్' నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ వినియోగదారులకు వారి పొలాల్లోనే స్విచ్ బోర్డులు, మోటార్ స్టార్టర్లను ఆపరేట్ చేసేటప్పుడు పాటించాల్సిన భద్రతా నియమాలపై అవగాహన కల్పించడానికి ఫీల్డ్ ఇంజినీర్ల ద్వారా 5,340 'పొలంబాట' సమావేశాలు నిర్వహించామన్నారు.

లైన్ క్లియరెన్స్ (LC) ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ కొత్తగా రూపొందించామని, LC మొబైల్ యాప్ ద్వారా లైన్ కియరెన్సు తీసుకోవడానికి సురక్షితమైన, భద్రమైన యాప్ అన్నారు. ప్రమాదాలను తగ్గించడానికి శిక్షణ, రక్షణ పరికరాల కోసం రూ.1.36 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. మెడికల్ పాలసీ ప్రకారం ఉద్యోగులకు ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌లు మరియు వైద్య సదుపాయాలు అందిస్తున్నామని, సర్కిల్, కంపెనీ స్థాయిలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు వినియోగదారులకు అందిస్తున్నామని, ఈ అవార్డు రావడానికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి ఉందని అన్నారు.

# టాలీవుడ్‌లో ఎన్నికల వేడి

**నేడే ఫిల్మ్ ఛాంబర్ పోరు.. బడా vs చిన్న నిర్మాతలు**

**నిర్మాతల మధ్య మాటల తూటాలు**

**వెలువడనున్న ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ**




హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): టాలీవుడ్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు నేడు జరగనున్న నేపథ్యంలో ఫిల్మ్‌నగర్ మొత్తం రాజకీయ వాతావరణం నెలకొంది. బడా నిర్మాతలు, చిన్న నిర్మాతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో మాటల తూటాలు పేలుతున్నాయి. బడా నిర్మాతలపై చిన్న నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిలక కోసం పనికిమాలిన హామీలు ఇస్తున్నారని వారు మండిపడ్డారు. చిన్న సినిమాలకు అధిక థియేటర్లు, టికెట్ ధరలు పెంచమని హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండస్ట్రీ మొత్తం ఒకరి గుప్పిట్లో ఉందని వారు హాట్ కామెంట్స్ చేశారు.

**ప్రోగ్రెసివ్ ప్యానెల్ Vs మన ప్యానెల్**

ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్‌కు, మన ప్యానెల్‌కు మధ్య హెూరాహెూరీ పోరు సాగుతోంది. పరిశ్రమ అభివృద్ధి, చిన్న నిర్మాతల సమస్యలు, థియేటర్ల నిర్వహణ వంటి అంశాలతో రెండు ప్యానెల్‌లు ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్‌కు ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, దిల్ రాజు బలంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. ఇక, మన ప్యానెల్‌కు చదలవాడ శ్రీనివాసరావు, సి. కళ్యాణ్, ప్రసన్న కుమార్ మద్దతుగా నిలుస్తున్నారు. చిన్న నిర్మాతల హక్కులు, సమాన అవకాశాలు, పెద్ద,చిన్న తేడా లేకుండా పరిశ్రమలో న్యాయం జరగాలన్నదే తమ లక్ష్యమని వారు స్పష్టం చేస్తున్నారు. ఈరోజు జరగనున్న టీఎఫ్సీసీ ఎన్నికల్లో ఏ ప్యానెల్ విజయం సాధిస్తుందన్నది సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల ఫలితాలు టాలీవుడ్ భవిష్యత్తుపై ప్రభావం చూపనున్నాయని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# కేంద్రం నిర్ణయంపై కాంగ్రెస్ గర్జన

**దేశవ్యాప్తంగా ఉపాధి హామీ బచావో ఉద్యమం**

**సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ కీలక తీర్మానం**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత శశిథరూర్‌తో సహా అనేకమంది హాజరయ్యారు.ఈ సందర్భంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కీలక వివరాలు వెల్లడించారు. జనవరి 5 నుండి దేశవ్యాప్తంగా 'మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' బచావో ఉద్యమం ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. శనివారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సారథ్యంలో జరిగిన పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి సమావేశం ఈ మేరకు తీర్మానించిందని స్పష్టం చేశారు. పేదవాడి ఆకలి తీర్చి, ప్రతి పౌరుడి ఉపాధికి హామీ ఇచ్చి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన చేకూర్చే బహుళ ప్రయోజనాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని' కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీవ్రంగా ఖండించిందని పేర్కొన్నారు. మహాత్ముడి పేరుతో తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని సీడబ్ల్యూసీ తీర్మానించిందని వెల్లడించారు. దీని కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాలని నిర్ణయించిందని వివరించారు. ఈ మేరకు సీడబ్ల్యూసీ సమావేశం ఫోటోలు షేర్ చేశారు.

# కలుషితమవుతున్న కృష్ణమ్మ

**మురుగునీరు, రసాయనాలతో ప్రమాదకరంగా మారిన జలాలు**


**113 గ్రామాల్లో నిలిచిన తాగునీటి సరఫరా**

**అల్లాడుతున్న హుజూర్‌నగర్ ప్రజలు**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల ప్రజలకు వ్యవసాయానికి, తాగునీటికి జీవనాధారమైన కృష్ణానది జలాలు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయి. నదీ పరీవాహక ప్రాంతాల్లో మురుగు నీటిని నిర్లక్ష్యంగా నదిలోకి వదలడం, రాత్రివేళల్లో పారిశ్రామిక వ్యర్థాలు, రసాయనాలను గుట్టుచప్పుడు కాకుండా కలపడం వల్ల కృష్ణా నీరు తాగునీటికి కూడా పనికిరాని స్థితికి చేరుతోంది. దీని ప్రభావంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గత 25 రోజులుగా 113 గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సాగునీరు, తాగునీటిపై ఆధారపడిన వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి కృష్ణానది పరిరక్షణ, ప్రక్షాళన, కాలుష్య నియంత్రణకు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# టీజీ టెట్ హాల్ టికెట్లు విడుదల



హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్-2026)కు సంబంధించి శనివారం తెలంగాణ పాఠశాల విద్యాశాఖ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ మేరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు జనవరి 3 నుంచి జనవరి 31 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో రెండు షిఫ్ట్‌లలో జరుగనున్నాయి. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ జర్నల్ నంబర్, పుట్టిన తేదీ వంటి లాగిన్ వివరాలతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చిన విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్ https://tgtet.aptonline.in/tgtetకు వెళ్లాలని తెలిపారు. అయితే, పరీక్ష కేంద్రంలోకి వెళ్లేవారు వెంట హాల్ టికెట్, ప్రభుత్వం ద్వారి మంజూరు చేసిన ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

# ఐఏఎస్ అధికారులకు కేంద్రం వార్నింగ్

**జనవరి 31లోపు ఆస్తుల వివరాలు వెల్లడించాల్సిందే**

**వెల్లడించని వారికి ప్రమోషన్ల నిలిపివేత**


**ప్రభుత్వ కార్యదర్శులకు డీఓపీటీ స్పష్టమైన ఆదేశాలు**




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు(ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రిటర్న్స్ - ఐపీఆర్) సపర్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన ఆస్తుల వివరాలను తప్పనిసరిగా జనవరి 31, 2026లోపు %ఊూ==ూఔ% ఆన్‌లైన్ మాడ్యూల్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 23, 2025న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సమర్పించాలని, గడువు తర్వాత ఆన్‌లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయబడుతుందని తెలిపింది. ఈ గడువులోగా వివరాలు సమర్పించని అధికారులకు విజిలెన్స్ క్లియరెన్స్ నిరాకరణ, ప్రమోషన్లు నిలిపివేయడం, క్రమశిక్షణ రాహిత్యం వంటి కఠిన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. గతంలో ఆన్‌లైన్ ఫైలింగ్ పెరిగినప్పటికీ, ఇకపై గడువును కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన అల్ ఇండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం అమలులో ఉందని, పారదర్శకత, అక్రమ సంపాదన నివారణకు ఇది కీలకమని డాఫ్ట్ పేర్కొంది. అధికారులు తప్పనిసరిగా గడువులోగా ఆస్తుల వివరాలు సమర్పించాలని సూచించింది.

# దేశంలోనే పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరించి, దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే సమగ్ర ప్రణాళికను రూపొందించింది. ఈ క్రమంలోనే 30 సర్కిళ్ల సంఖ్యను 60కి పెంచిన నేపథ్యంలో ఆ సర్కిళ్లకు తాజాగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ల నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరో రెండు, మూడు రోజుల్లో డిప్యూటీ కమిషనర్లు బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఇటీవల 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషరన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడంతో నగర విస్తీర్ణం 650 చదరపు కిలో మీటర్ల నుంచి సుమారు 2,053 చదరపు కిలో మీటర్లకు పెరిగింది. అదేవిధంగా జనాభా కూడా 1.3 కోట్లు దాటింది. ఈ విస్తరణకు అనుగుణంగా జీహెచ్‌ఎంసీ పరిపాలనా వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించారు. ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు, 30 సర్కిళ్లను 60కి, 150 వార్డులను 300కి పెంచారు. కాగా, 60 సర్కిళ్లకు అనుగుణంగా 60 మంది డిప్యూటీ కమిషనర్లు/ డిప్యూటీ మునిసిపల్ కమీషనర్లు) నియామకం కూడా పూర్తయింది. విలీనమైన 27 అర్బన్ లోకల్ బాడీల మాజీ మున్సిపల్ కమిషనర్లను తాత్కాలికంగా డిప్యూటీ కమిషనర్లుగా నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




# చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్

**ప్రయాణికులకు తక్కువ ధరలో విలాసవంతమైన విశ్రాంతి**

**200ల నుంచే ప్రారంభం, గంటల ప్రాతిపదికన ధరల పట్టిక**

**ప్రయాణికుల లగేజీ కోసం ప్రత్యేక లాకర్ల సదుపాయం**

**ప్రయాణికుల కోసం రైల్వే శాఖ వినూత్న ఏర్పాట్లు**






హైదరాబాద్, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): రైల్వే ప్రయాణికులకు శుభవార్త. రైలు ప్రయాణీకుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్‌లను ఏర్పాటు చేసింది. సౌకర్యవంతంగా విశ్రాంతి తీసుకునేందుకు రైల్వేశాఖ స్లీపింగ్ పాడ్‌లను అందుబాటులోకి తెస్తోంది. తాజాగా దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్‌లను ప్రయాణీకుల కోసం సిద్ధం చేసింది. రైలు పెట్టెలో పడకలను తలపిస్తూ లాకర్ల సదుపాయంతో కూడిన ఈ స్లీపింగ్ పాడ్‌లు ఆకట్టుకొంటున్నాయి. మధ్యతరగతి ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా వీటి ఛార్జీలను నిర్ణయించారు. రెండు గంటలకు రూ.200 కాగా ఆరు గంటలకు రూ.400, 12 గంటలకు రూ.800, 24 గంటలకు రూ.1200గా ధరలను నిర్ణయించారు. తొలుత జపాన్‌లో ప్రారంభమైన ఈ తరహా వసతి ఏర్పాటు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో వీటిని ప్రారంభించిన అధికారులు తాజాగా ఈ సౌకర్యాన్ని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లోనూ ఏర్పాటు చేశారు.

# బాక్సింగ్‌డే టెస్ట్‌లో ఇంగ్లండ్‌దే గెలుపు!

**యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఎట్టకేలకు విజయం**

**14 ఏళ్ల నిరీక్షణ తర్వాత విక్టరీ**

**రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టు మ్యాచ్**



యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఎట్టకేలకు విజయం సాధించింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. 175 పరుగుల లక్ష్యంతో దిగిన ఇంగ్లాండ్ ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (37 పరుగులు), (బెన్ డకెట్ 34 పరుగులు), జాకబ్ బెథెల్ (40 పరుగులు) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్ తలో 2 వికెట్లు పడగొట్టారు. పూర్తిగా బౌలర్ల ఆధిపత్యం నడించిన ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. 14 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్ గెలిచింది. 2010-11లో చివరిసారిగా ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ గెలుపొందింది. 175 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ 32.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు గెలుపొందింది. జాకోబ్ బెతెల్(46 బంతుల్లో 5 ఫోర్లతో 40), బెన్ డకెట్(26 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాక్ క్రాలీ(48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జై రిచర్డ్‌సన్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. అంతకుముందు ఓవర్-నైట్ స్కోర్ 4-0తో ఆసీస్ రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో 34.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగుల ఆధిక్యం కలుపుకొని ఇంగ్లాండ్‌కు 175 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో మొదట ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ కాగా, ఇంగ్లాండ్ 110 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో ఈ టెస్టులో తొలి రోజే 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజూ బౌలర్ల ఆధిపత్యం కొనసాగడంతో రెండు రోజుల్లోనే టెస్టు మ్యాచ్ ముగిసింది. ఈ టెస్టు మ్యాచ్‌లో బౌలర్ల జోరు కొనసాగింది. ఇరుజట్లలోని పేసర్లు నిప్పులు చెరిగారు. బౌలర్లదే ఆధిపత్యంగా సాగిన ఈ టెస్టులో ఇరు జట్లలోని ఏ బ్యాటర్ కూడా 50ం స్కోర్ చేయలేదు. తొలుత ఆసీస్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు టంగ్, అట్కిసన్, బ్రెండన్ కార్స్, బెన్ స్టోక్స్ కట్టడి చేయగా, అనంతరం ఇంగ్లాండ్‌ను ఆసీస్ బౌలర్లు నెసర్, బొలాండ్, మిచెల్ స్టార్క్ , కామెరూన్ గ్రీన్ అడ్డుకున్నారు. రెండో ఇన్నింగ్స్?లోనూ పేసర్లే సత్తా చాటారు. మ్యాచ్‌లో కూలిన మొత్తం 36 వికెట్లను కూడా పేసర్లే పడగొట్టడడం విశేషం. ఇక రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన ఇంగ్లాండ్ పేసర్ జోష్ టంగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. గత 15ఏళ్లలో ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఆసీస్ గడ్డపై ఇంగ్లాండ్ చివరిసారిగా 2010-11 యాషెస్‌ను 3-1తో దక్కించకుంది. ఆ తర్వాత 15ఏళ్ల నుంచి ఇంగ్లాండ్‌కు అక్కడ ఒక్క విజయం కూడా దక్కలేదు. ఈ మధ్య కాలంలో ఇంగ్లీష్ జట్టు 18 టెస్టులు ఆడింది. అందులో 16 మ్యాచ్‌ల్లో ఓడగా, రెండింటిని డ్రా చేసుకుంది. తాజా విజయంతో ఆసీస్ గడ్డ మీద 5,468 రోజుల తర్వాత ఓటముల పరంపరకు బ్రేక్ పడింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన ఈ టెస్టు మ్యాచ్ మరో అరుదైన ఘనత సాధించింది. తొలి రోజైన శుక్రవారం ఈ మ్యాచ్ చేసేందుకు 94, 199 మంది అభిమానులు స్టేడియానికి వచ్చారు. ఓ టెస్టు మ్యాచ్?కు హాజరైన ప్రేక్షకుల్లో ఇది అత్యధికం. ఇక శనివారం కూడా భారీగానే ఫ్యాన్స్ హాజరైయ్యారు. తొలి రోజులో పోలిస్తే కాస్త తక్కువగా వచ్చారు. రెండో రోజు (శనివారం) 92,045 మంది మెల్‌బోర్న్ మైదానంలో లైవ్ మ్యాచ్ చూశారు. కాగా, ఈ యాషెస్?లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం. ఇప్పటికే సిరీస్?ను ఆసీస్ 3-1తో సొంతం చేసుకుంది. ఇక ఇరుజట్ల మధ్య ఐదో టెస్టు మ్యాచ్ సిడ్నీ వేదికగా 2026 జనవరి 04న జరగనుంది.

# హర్మన్ ప్రీత్ కౌర్ అరుదైన ఘనత..

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా మహిళా జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల టీ20 క్రికెట్‌లో అత్యధిక మ్యాచుల్లో విజయాన్ని అందించిన కెప్టెన్‌గా రికార్డులకు ఎక్కింది. తిరువనంతపురం వేదికగా శ్రీలంకతో జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో.. భారత్ విజయం సాధించడం ద్వారా హర్మన్ ఈ అరుదైన ఘనత అందుకుంది. టీ20ల్లో కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 77వ విజయం. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ప్లేయర్ మెగ్ లాన్నింగ్‌ను అధిగమించింది. మెగ్ లాన్నింగ్ 100 మ్యాచ్‌ల్లో ఆసీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించగా 76 మ్యాచ్‌ల్లో విజయాన్ని అందించింది. ఇక హర్మన్ విషయానికి వస్తే.. 130 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా 77 మ్యాచ్‌ల్లో గెలిపించింది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే ప్రత్యర్థిపై




అత్యధిక విజయాలను అందించిన కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. శ్రీలంకపై కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 16వ విజయం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిరీ?త 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. భారత బౌలర్లలో పేసర్ రేణుకా సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టింది. స్పిన్నర్ దీప్తి శర్మ మూడు వికెట్లు తీసింది. ఆ తరువాత షెఫాలి వర్మ (79 నాటౌట్ బీ 42 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచికొట్టడంతో 113 పరుగుల లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. ఈ విజయంతో భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది.

# సంక్రాంతికి సందడి చేయనున్న చిరు, వెంకీ



## ఆర్ యూ రెడీ సాంగ్ ప్రోమో విడుదల

'ఆర్ యూ రెడీ' అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే.. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి - నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు - వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.


# కూలీపై విమర్శలు స్వాగతించిన లోకేశ్ కనగరాజ్



తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని వాటిని సరిదిద్దుకుంటానని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా గురించి లోకేశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించి ప్రస్తావించారు. కూలీ' సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను' అని తెలిపారు. రజనీకాంత్, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రజనీ తన మార్క్‌తో అలరించారు. 'వార్ 2'తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.



# నేనైతే మారుతి రైటింగ్ కి ఫ్యాన్ అయిపోయాను!: ప్రభాస్



డార్లింగ్ ప్రభాస్ వరుసగా యాక్షన్ సినిమాల్లో నటిస్తున్న సమయంలో మారుతి హారర్ కామెడీతో అతడికి కొత్త దారి చూపించిన సంగతి తెలిసిందే. ఈ సంక్రాంతి కానుకగా -ది రాజా సాబ్- థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుకలో ప్రభాస్ మాట్లాడుతూ.. ఈ సినిమా హారర్ కాన్సెప్టుల్లో ఇంతవరకూ రాని పాయింట్‌తో వస్తుందని తెలిపారు. ప్రభాస్ మాట్లాడుతూ.. -మూడు సంవత్సరాల స్ట్రెస్, పెయిన్, బాధ్యత ఇవన్నీ మా సినిమాకి కలిసొచ్చాయి.. మారుతి చాలా శ్రమించాడు. మొదట దర్శకుడు మారుతి నేను మన ఫ్యాన్స్‌కి చాలా సంవత్సరాల తర్వాత కొత్తగా ఏదైనా ఇవ్వాలని అనుకున్నాం. అన్నీ డిష్యుం డిష్యుం సినిమాలే.. ఎంటర్ టైన్ చేయాలి అన్నాను. చివరికి హారర్ కామెడీ తో మా ప్రయాణం మొదలైంది. ఈ సినిమాతో చాలా హాస్యం, వినోదం అందిస్తాను. నిజానికి ఈ కథ ఒక ఫేస్‌కి వెళ్లేప్పటికి క్లైమాక్స్ ఊహించనంత మలుపు తిరుగుతుంది.. నేనైతే మారుతి రైటింగ్ కి ఫ్యాన్ అయిపోయాను! క్లైమాక్స్ అద్భుతం. చాలా కొత్త పాయింట్ తో తీసాడు.. హారర్ కాన్సెప్టుల్లోనే అదో వైవిధ్యమైన ప్రయత్నం. ఏదేమైనా నాకు 15 ఏళ్ల తర్వాత ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చాడు. ఈ చిత్రం సంక్రాంతికి వస్తోంది- అని తెలిపారు. సంక్రాంతి సినిమాల్లో అన్నీ బ్లాక్ బస్టర్ అవ్వాలి. చాలా ముఖ్యంగా గమనించాల్సినది... సీనియర్స్ (చిరంజీవి, రవితేజ సినిమాలొస్తున్నాయి) నుంచి నేర్చుకున్నదే. సీనియర్స్ సక్సెసవ్వాలి. మేము కూడా విజయం సాధించాలని కూడా ప్రభాస్ ఆకాంక్షించారు. ఇక ఉత్తరాదిన ది రాజా సాబ్ చిత్రాన్ని విడుదల చేస్తున్న అనీల్ తడానీ గురించి వేదికపై ప్రభాస్ గుర్తు చేసుకున్నారు. -అనీల్ తడానీ .. నా బ్రదర్.. నా సినిమాలన్నిటికీ ఆయనే వెన్నెముక. ది రాజా సాబ్ ని రిలీజ్ చేస్తున్నారు -అని తెలిపారు. ఈ చిత్రంలో నటించిన అందాల కథానాయికలు మనసుల్ని గెలుచుకుంటారు. సంజయ్ దత్ సర్ స్క్రీన్ ప్రెజెన్స్ చాలు. క్లోజప్ పెడితే చాలు.. అద్భుతంగా నటిస్తారు. ఇందులో నాన్నమ్మ పాత్రధారి బాగా కుదిరారు. ఇది నానమ్మ- మనవడు కథ.. ఈ సినిమాకి హీరో విశ్వప్రసాద్ గారు. బడ్జెట్ విషయంలో రాజీకి రాకుండా నిర్మించారు. మూడు సంవత్సరాలకు పూర్తయింది. బడ్జెట్ మేం అనుకున్నది వేరు. కానీ ఎక్కడికో వెళ్లింది. నిజానికి మేం భయపడ్డాం కానీ... ఈయన అస్సలు భయపడరు. రాజా సాబ్ కి హీరో విశ్వప్రసాద్ గారు. థమన్ .. మాత్రమే ఆర్.ఆర్ చేయగలడు అనుకున్నాం.. అతడు అద్భుతమైన పనిని అందిస్తున్నాడు. డివోపి కార్తీక్.. నాణ్యమైన విజువల్స్ ని అందించారు. రామ్ లక్ష్మణ్ మాస్టర్స్, సోల్మన్ మాస్టర్స్ అద్భుతమైన ఫైట్స్ కొరియోగ్రాఫ్ చేసారు- అని ప్రభాస్ తెలిపారు. కార్యక్రమంలో మారుతి, విశ్వప్రసాద్, ఎస్కే ఎన్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ తదితరులు పాల్గొన్నారు.

# సహనా..సహనా సాంగ్ కొత్తగా చూపారు

## రాజాసాబ్ సాంగ్‌పై నిధి అగర్వాల్

ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463